

నేడు విడపనకల్‌లో 'జగనన్నకు చెబుదాం'



ప్రజాశక్తి-ఉరవకొండ రూరల్

విడపనకల్‌లో మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని బుధవారం నాడు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎమ్.గౌతమి తెలిపారు. విడపనకల్ మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి జగనన్నకు చెబుదాం, స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొనే ఈ సమావేశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డీ.హీరేహాళ్‌లో ఇథనాల్ పరిశ్రమ



డి.హిరేహాళ్ మండలం జాజరకల్లు గ్రామం వద్ద మొక్కజొన్న, బియ్యం నూక ఆధారిత డిస్టిలరీ ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు చేయనున్న ప్రాంతం ఇదే...

◆ రూ.544 కోట్లతో ప్రారంభం

◆ నేడు వర్చువల్‌లో ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు జరుగనుంది. డీ.హీరేహాళ్ మండలంలోని జుంజురాంపల్లి గ్రామంలో దీని ఏర్పాటుకు శ్రీకారం చుట్టనున్నారు. ప్రయివేటురంగంలో ఈ పరిశ్రమ ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ మేరకు బుధవారం నాడు శంకుస్థాపన చేయనున్నారు. ఆన్‌లైన్ విధానంలో జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో పాల్గొననున్నారు. జిల్లా కలెక్టర్ గౌతమి, ఇతర అధికారులు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రారంభించనున్నారు.

రూ.544 కోట్లతో ప్రారంభం

జుంజురంపల్లి గ్రామం పరిధిలో ఏర్పాటు చేయనున్న ఈ పరిశ్రమకు 29.95 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్నారు. రూ.544 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయబోయే ఈ పరిశ్రమ వల్ల 500 మందికి ఉపాధి కల్పించనున్నట్టు ఆ సంస్థ ప్రకటించింది. ఎకో స్టీల్ అనే పరిశ్రమ దీని ఏర్పాటు చేయనుంది. నూకలు, మొక్కజొన్నలతో ఇథనాల్‌ను తయారు చేయనున్నారు. స్టీల్ రంగంలోనున్న ఈ పరిశ్రమ ఇప్పుడు ఇథనాల్ రంగంలోకి ప్రవేశించనుంది.

ఇథనాల్‌కు పెరుగుతున్న డిమాండ్

ఇథనాల్ తయారీని కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సహిస్తోంది. ఇథనాల్‌ను మద్యం తయారీలోకే కాకుండా వాహనాలకు ఇంధనంగానూ వాడుతున్నారు. దీంతో ఇథనాల్ తయారీని కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. అయితే ఈ సంస్థ సామర్థ్యం ఏ మేరకు అన్న దానిపై స్పష్టత లేదు. ఆ సంస్థ ఇంకా అధికారిక ప్రకటనేది చేయలేదు. ప్రారంభోత్సవ సందర్భంగానైనా పూర్తి వివరాలను ఆ సంస్థ ప్రకటించనుందా.? లేదా.? అన్నది చూడాల్సి ఉంది. .

కాకరేపుతున్న ఎంపిపి మార్పు వివాదం

బికెఎస్ అధికార పార్టీలో వర్గపోరు.?

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

బుక్కరాయసముద్రంలో ఎంపిపి మార్పు విషయం అధికార పార్టీలో విభేదాలను మరోమారు బహిర్గతం చేస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న అధికార పార్టీ ఎంపీపీ దాసరి సునీత పదవిని చేపట్టే సమయంలో రెండు సంవత్సరాలు అధికారంలో ఉండేలా తరువాత మరొకరికి ఈ పవి ఇచ్చేలా అప్పట్లో పార్టీ పెద్దల సమక్షంలో నిర్ణయం జరిగినట్లు తెలుస్తోంది. అధిష్టానం నిర్ణయం మేరకు కాలువ వెంకటలక్ష్మికి ఎంపిపి పదవి ఇచ్చేలా నిర్ణయం జరిగిందనే ప్రచారం జరుగుతోంది. కాలువ వెంకటలక్ష్మి మద్దతదారులు ఎంపిపి విషయంపై శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్య కమిటీ ఛైర్మన్ ఆలూరు సాంబశివరెడ్డితో మాట్లాడినట్లు సమాచారం. ఇదే సమయంలో ప్రస్తుత ఎంపీపీ దాసర సునీత ఎన్నికల సమయంలో తాను చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి వైసిపిపై అభిమానంతో పార్టీలో చేరానని, ఇలాంటి పరిస్థితుల్లో రెండేళ్లకే తనను ఆ పదవి నుంచి దింపేయడం సరికాదనే వాదనను విన్పిస్తున్నారు. ఓ వైపు ఉద్యోగం కోల్పోయి, మరో వైపు పదవిని కోల్పోతే తాము పూర్తిగా నష్టపోతామనే భావనను వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయం తమ కుల నాయకుల వద్ద ప్రస్తావించి, తనకు మద్దతుగా నిలవాలని కోరుతున్నారు. ఎంపిపి మార్పు జరిగితే వైఎస్ ఎంపిపి మార్పు కూడా జరగాల్సి ఉంది. ఈ పదవిపై చాలా మంది ఎంపిటిసిలు ఆశ పెట్టుకున్నారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో పార్టీ నేతల్లో నెలకొన్న ఈ పరిస్థితులు అధినాయకత్వం కూడా కొత్త తలనొప్పిలు తెస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వైసిపి అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటోందనేది వేచిచూడాలి.



బుక్కరాయసముద్రం మండల పరిషత్ కార్యాలయం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను 24గంటల ఆసుపత్రులుగా మార్చాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

నియోజకవర్గంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను 24 గంటల ఆసుపత్రులుగా మార్చి సిబ్బందిని నియమించి అందుబాటులోకి తీసుకురావాని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సమక్ష పేరుతో ప్రతి కుటుంబంలోని వ్యక్తుల ఆరోగ్య సమస్యలు తెలుసుకోవడం తప్ప చేసింది శూన్యమన్నారు. ఆరోగ్య సర్వేలు.. సమావేశాలతో ఆరోగ్యం కుదుటపడదని, ఆరోగ్య కేంద్రాలను పటిష్టంగా నిర్వహించడం ద్వారానే అది సాధ్యమవుతుందన్నారు. ప్రచార ఆర్భాటానికి కాకుండా శాశ్వతమైన చర్యలు తీసుకుంటే ప్రజల ఆరోగ్యాన్ని కాపాడినవారు అవుతారన్నారు. ఇప్పటికీ గర్భిణులు కాన్పుల కోసం ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్తున్నారంటే ప్రభుత్వ వైద్యశాలల్లో సౌకర్యాలు లేవని అర్థం అన్నారు. ప్రజల మేలుకోరే ప్రభుత్వం అయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను 24 గంటల ఆసుపత్రులుగా మార్చి సిబ్బందిని అందుబాటులోకి తీసుకొస్తే మంచిదన్నారు. కావున ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం స్పందించి నియోజకవర్గ పరిధిలో పనిచేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 24 గంటల ఆసుపత్రిగా మార్చి సిబ్బందిని నియమించడంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆర్.కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఐఎ అధికారుల అనుచిత చర్యలను నిరసిద్దాం

మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమాజం కోసం ప్రశ్నించే మేధావులపై కేంద్ర ప్రభుత్వం ఎన్ఐఎ అధికారులు అనుచితంగా దాడులు, బెదిరింపులు అనుచిత చర్యలను నిరసిద్దామని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మానవ హక్కుల వేదిక తెలుగురాష్ట్రాల కన్వీనర్ చంద్రశేఖర్‌పై ఎన్ఐఎ అధికారులు అనుచితంగా, అన్యాయంగా కేసుల్లో చేర్చడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆయన మాట్లాడుతూ సమాజం పట్ల జరిగే అన్యాయాలను చంద్రశేఖర్ వంటి మేధావులు వేదికల ద్వారా ప్రశ్నిస్తున్నారని తెలిపారు. ఎన్ఐఎ అధికారులు పోలీసులతో ఇంటి వద్దకు వెళ్లి సోదాలు నిర్వహించడం ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. ఎన్ఐఎ అధికారులకు సాధారణ పుస్తకాలు తప్పా ఇంకేమ లభించలేదన్నారు. చంద్రశేఖర్ దంపతులు సాధారణ జీవితం గడుపుతున్నారని తెలిపారు. ప్రిన్సిపల్‌గా విద్యా రంగంలో విశేష సేవలు అందించ పదవి విరమణ పొంది శేషజీవితం గడుపుతున్నారని తెలిపారు. మేధావులు ఏవైనా సమాజాన్ని పట్టి పీడించే అంశాల పట్ల ఖండిస్తూ రాజ్యాంగ విలువలు, హక్కుల వైపు నిలబడి అన్యాయాన్ని అసమానతలను ప్రశ్నిస్తుంటారని తెలిపారు. వాళ్ల జీవితం అంతా బహిరంగమే అన్నారు. విభిన్న అభిప్రాయాలు ఉన్న తామంతా వారితో కలిసి పని చేస్తున్నామని తెలిపారు. ఒక గౌరవమైన స్థానంలో ఉన్న వారిని సంబంధం లేని కేసుల్లో చేర్చడం అన్యాయంగా ఉందన్నారు. ఇలాంటి చర్యలతో మేధావులు, సామాజిక కార్యకర్తలను భయపెట్టవచ్చనే ప్రభుత్వాలు అనుకోవడం మూర్ఖత్వమే అవుతుందని విమర్శించారు. చట్ట విరుద్ధమని నిజం ఇప్పటికే ఈ విషయంపై ఎన్ఐఎకు అర్థమయ్యే ఉంటుందన్నారు. చంద్రశేఖర్, రసూల్‌పై ఎన్ఐఎ పెట్టిన తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇలాంటి మేధావుల విషయంలో జోక్యం చేసుకుని వారికి అన్యాయం జరగకుండా కాపాడాలని కోరారు.

కార్మికులు, రైతులను దగా చేస్తున్న మోదీ ప్రభుత్వం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

దేశంలోని రైతులు, కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా దగా చేసిందని రైతు, కార్మిక సంఘాల నేతలు విమర్శించారు. మంగళవారం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నల్లచట్టాలను నిరసిస్తూ రైతు సంఘాల ఆధ్వర్యంలో బ్లాక్‌డేగా పరిగణిస్తూ కృష్ణ కళామందిరం నుంచి ఎన్టీఆర్ విగ్రహం మీదుగా టవర్‌క్లాక్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి మల్లికార్జున, సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రైతాగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం తేవాలన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలన్నారు. 2021 అక్టోబర్ 3న ఢిల్లీ రైతాంగ ఉద్యమ సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని లకింపూర్ ఖేరిలో శాంతియుతంగా ర్యాలీ చేస్తున్న రైతులను కార్లతో తొక్కించి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు నలుగురు రైతు ఉద్యమకారులను అత్యంత దారుణంగా హత్య చేయడం జరిగిందని గుర్తు చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రా ను వెంటనే కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని దేశవ్యాప్తంగా రైతాంగం ముక్తకంఠంతో డిమాండ్ చేసినా కేంద్ర మోదీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. మారణకాండకు కారణమైన కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి కుమారుడు ఆశిష్ మిశ్రాను, బిజెపి గుండాలను శిక్షించకుండా వదిలేయడం దుర్మార్గమన్నారు. ఢిల్లీ రైతాంగం సందర్భంగా కేంద్ర మోడీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తీవ్రంగా విమర్శించారు. రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పంటలకు మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం వెంటనే తీసుకురావాలని కోరారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాల రంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.కష్ణమూర్తి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్ నారాయణ, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు రాజేష్‌గౌడ్, సిఐటియు నగర అధ్యక్షుడు శ్రీనివాసులు, ఏఐటియుసి నగర అధ్యక్షులు వికే.కష్ణుడు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు బండారి ఎర్రిస్వామి, కోశాధికారి లక్ష్మీనరసమ్మ, ఆటో యూనియన్ నాయకులు శివ ప్రసాద్, నాగరాజు, రామాంజనేయులు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : రైతు పండించిన పంటలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు ధర కల్పించి అన్నివిధాలుగా ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. బ్లాక్ డే సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో నల్లరిబ్బన్లతో కళ్లకు గంతలు కట్టుకుని మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను విడనాడాలన్నారు. ముఖ్యంగా మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని, రైతుల మోటార్లకు మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలని, లక్కీమ్ పూర్ కెరీర్‌లో రైతుల మరణానికి కారణమైన కేంద్రమంత్రి అజయ్‌కుమార్ మిశ్రాను మంత్రివర్గం నుంచి తొలగించాలని, రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని, రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఉపాధి హామీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసి ఏడాదిలో 200 రోజులు పని దినాలు కల్పించి రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని, ఒక్కొక్క సిలిండర్ ధర రూ.400తో సంవత్సరంలో మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా, భూమిలేని కుటుంబాలకు ఒక్కొక్కరికి మూడెకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్య.కా.సం మండల కార్యదర్శి సుంకన్న, రైతుసంఘం మండల కమిటీ సభ్యులు వెంకటస్వామి, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, వెంకట్‌నారాయణ, కుళ్లాయిస్వామి, వెంకటేష్, ఆదినారాయణ, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : బ్లాక్ డే సందర్భంగా మండలంలోని కడవకల్లు గ్రామంలో ఉన్న వైఎస్ఆర్ సర్కిల్‌లో రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన మూడు నల్లచట్టాలను రద్దు చేయాలని, ఉత్తరప్రదేశ్‌లోని లిఖింపురి కేరి గ్రామంలో రైతుల మరణానికి కారణమైన కేంద్రమంత్రి అజయ్‌మిశ్రా, కుమారుడు అమిత్‌మిశ్రాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సూరి, రైతుసంఘం మండల కార్యదర్శి జి.వెంకట్‌చౌదరి, వ్య.కా.సం అధ్యక్ష, కార్యదర్శులు టి.పెద్దయ్య, భాస్కర్‌రెడ్డి, నాగభూషణం, కుళ్లాయిరెడ్డి, గంగయ్య, నాగేష్, నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



పుట్లూరు మండలం కడవకల్లులో నిరసన తెలుపుతున్న రైతుసంఘం నాయకులు

బ్లాక్ డేగా పరిగణిస్తూ రైతు సంఘాల నిరసన



అనంతపురం టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలుపుతున్న రైతుసంఘాల నాయకులు

రాప్తాడులో.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని, రైతుల మోటార్లకు మీటర్లు బిగించరాదని ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి పోతలయ్య తెలియజేశారు. రాప్తాడు మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతుసంఘాల ఆధ్వర్యంలో బ్లాక్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నల్ల రిబ్బన్లతో కళ్లకు గంతులు కట్టుకుని మోకాళ్లపై నిరసన తెలియజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను నట్టేట ముంచారు. రైతు, కార్మిక వ్యతిరేక విధనాలను అవలంభిస్తున్న బిజెపి ప్రభుత్వానికి గట్టిగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, సుబ్బిరెడ్డి, కొండారెడ్డి, నారాయణస్వామి, సత్యప్ప, గోపాల్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మొదలైన నీటి ఘర్షణ

ప్రజాశక్తి-పుట్లూరు



ముచ్చుకోట వద్ద నీటిని నిలిపేయిస్తున్న పోలీసులు

పెనకచెర్ల డ్యామ్ నుంచి గత వారం రోజులు క్రితం హెచ్ఎల్సీ నీటిని పుట్లూరు మండలంలోని సుబ్బరాయుడు సాగర్‌కు విడుదల చేశారు. సోమవారం నాడు కొందరు సుబ్బరాయసాగర్‌కు వెళ్లే నీటిని అడ్డగించారు. అక్కడి నుంచి కొప్పూరు మండలంలోని ముచ్చుకోట డ్యాంకు నీటిని విడుదల చేశారు. మంగళవారం నాడు అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి ఆధ్వర్యంలో ముచ్చుకోటకు వెళ్లే నీటిని బంద్ చేయించారు. గత మూడు సంవత్సరాల నుంచి వర్షాలు ఎక్కువ పడడంతో చెరువులు, కుంటలు డ్యాములు కళకళాడుతుండేవి. ఈ సంవత్సరం వర్షాలు లేక పోవడంతో చెరువులు డ్యాములు వెలవలబోతున్నాయి. దీంతో నీటికోసం గ్రామాల మధ్య ఘర్షణలు మొదలవుతున్నాయి. ఇలాంటి పరిస్థితిని గుర్తించిన పోలీసులు ఇప్పటికే గ్రామాల్లో ముందస్తు బందోబస్తు చర్యలు చేపట్టారు. పుట్లూరు సిఐ సుబ్రహ్మణ్యం, బికెఎస్ సిఐ నాగార్జున రెడ్డి, పుట్లూరు ఎస్ఐ దిలీప్‌కుమార్, ఆత్మకూరు ఎస్ఐ జనార్ధన్, హెచ్ఎల్సీ ఈఈ రమణారెడ్డి, ఏఈ గోపాల్ నాయక్, ఎడబ్ల్యు ఫణీంద్ర, తదితరుల ఆధ్వర్యంలో ఇప్పటికే గ్రామాల్లో నీటి సమస్యలపై గ్రామపెద్దలతో మాట్లాడుతన్నారు. అక్రమ నీటి మళ్లింపులకు పాల్పడరాదంటూ హెచ్చరిస్తున్నారు.



జెసిబితో ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

నార్పలలో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-నార్పల

భారీ పోలీసు బందోబస్తు మధ్య మండల కేంద్రంలోని పాత బస్టాండు, కుతలేరు వంక సమీపంలోని ఆక్రమణలను అధికారులు మంగళవారం తొలగించారు. గత కొన్నేళ్లుగా కుతలేరు నూతన వంతెన నిర్మాణం ఆగిపోయిన విషయం తెలిసిందే. వంతెన నిర్మాణం ముందుకు సాగాలంటే ఆక్రమణలు తొలగిపోవాలని అధికారులు చెబుతూ వస్తున్నారు. అయినా ఎవరూ వినకపోవడంతో మంగళవారం ఉదయం భారీ పోలీస్ బందోబస్తు మధ్య బస్టాండ్‌లోని పలు ఆక్రమణలను తొలగించారు. అయితే బస్టాండ్ ఆవరణలో ఉన్న పురాతన కొల్లపురమ్మ ఆలయాన్ని తొలగిస్తున్నారని ప్రచారం సాగడంతో గ్రామస్తులు భారీఎత్తున తరలివచ్చారు. అయితే కేవలం ఆక్రమణలను మాత్రమే తొలగిస్తున్నామని, ఆలయాన్ని తొలగించడమని తహశీల్దార్ హరికుమార్, ఎంపిడిఒ దివాకర్, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలియజేయడంతో చాలామంది వెనక్కి వెళ్లారు. ఆక్రమణల తొలగింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ అస్రార్‌బాషా, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు, అధికారులు నాగరాజు, రామకృష్ణ, వెంకటేశు, ఆర్అండ్‌బి, రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ సంబంధంతోనే హత్య

ప్రజాశక్తి-రాయదుర్గం

అక్రమ సంబంధం నేపథ్యంలో హత్య చేయడంతోనే బొమ్మనహాల్ మండల పరిధిలోని తుంగభద్ర ఎగువ కాలువలో శవం తేలిందని డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. బొమ్మనహాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుంగభద్ర ఎగువ కాలువలో గతవారం శవమై తేలిన మృతదేహం కేసును ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు రాయదుర్గం రూరల్ పోలీసులు 48 గంటల్లోనే ఛేదించారు. మంగళవారం రాయదుర్గంలోని రూరల్ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బొమ్మనహాల్ మండలం మైలాపురం గ్రామం సమీపంలోని తుంగభద్ర ఎగువ కాలువలో ఓ గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం తేలాడుతూ కాళ్లు, చేతులు తాళ్లతో కట్టివేసినట్లు గుర్తించారు. దీనిపై మైలాపురం గ్రామ రెవెన్యూ అధికారి కుళ్లాయిస్వామి ఫిర్యాదు మేరకు బొమ్మనహాల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈనేపథ్యంలో కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసుల పర్యవేక్షణలో రాయదుర్గం రూరల్ సిఐ వి.యుగంధర్, బొమ్మనహాల్ ఎస్ఐ జి.శివ, డి.హీరేహాల్ ఎస్ఐ జి.రంగడుయాదవ్, సిబ్బంది రెండు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కేసును ఛేదించినట్లు తెలిపారు. గుర్తు తెలియని మృతదేహం కర్నాటకలోని బళ్లారి వాసి ఎం.వినోద్‌రాజ్ (30)గా పోలీసులు గుర్తించారు. కేసును ఆరాతీయగా వినోద్‌రాజ్‌కు మల్లికార్జున మధ్య సమస్యలు ఉన్నాయి. దీంతో వినోద్‌రాజ్‌ను ఎలాగైనా హతమార్చాలని మల్లికార్జున భావించి తన స్నేహితులైన ఆదినారాయణ, పవన్‌కళ్యాణ్, వడ్డే రమేష్, పాండుతో కలిసి గతనెల 26న రాత్రి వినోద్‌రాజ్‌ను ఇంటికి రమ్మని పిలిపించుకున్నారు. వచ్చీరాగానే తలుపులు మూసేసిన నిందితులు మూకుమ్మడిగా కాళ్లు, చేతులను తాడుతో కట్టి మూతికి బట్ట పెట్టారు. అక్కడి నుంచి ట్రాక్టర్‌లో మృతదేహాన్ని తీసుకుని బళ్లారి నగర శివారులో కృష్ణానగర్ దగ్గర తుంగభద్ర ఎగువ కాలువపై ఉన్న ఐరన్ బ్రిడ్జిపై వేశారు. కట్టిన తాళ్లను విప్పుకోలేక, నీటి నుంచి బయటికి రాలేక ఊపిరాడక చనిపోయి నీటి ప్రవాహానికి కొట్టుకుని మైలాపురం గ్రామం వద్ద శవమై నీటిలో తేలియాడుతూ కనిపించాడు. దీంతో కేసును ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకోవడంతోపాటు ట్రాక్టర్, 3 ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన సిబ్బందిని డీఎస్పీతోపాటు ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం రూరల్ సీఐ యుగంధర్, పోలీస్ ఇన్స్‌పెక్టర్ లక్ష్మన్న, బొమ్మనహాల్ ఎస్ఐలు శివ, రంగడు సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం కేసు ఛేదింపు

డీఎస్పీ శ్రీనివాసులు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

తాగునీటి కార్మికుడు సుబ్బరాజును విధుల్లోకి తీసుకోవాలి

అనంతపురం కలెక్టరేట్ : నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో 13ఏళ్ల సేవలు అందించిన కార్మికుడు సుబ్బరాజును కాంట్రాక్టర్ అకారణంగా తొలగించారని, వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ మడకశిర డివిజన్‌లో కార్మికుడు సుబ్బరాజు పని చేస్తున్నాడని తెలిపారు. కాంట్రాక్టర్ కలాం నాయుడు కక్షసాధింపు చర్యలకు పాల్పడి తొలగించారని తెలిపారు. కార్మికులకు రావాల్సిన హక్కులను ప్రశ్నించినందుకు ఇలాంటి చర్యలకు కాంట్రాక్టర్ పాల్పడ్డారని తెలిపారు. కలెక్టర్ జోక్యం చేసుకుని కార్మికునికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికుల యూనియన్ నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మాంటిస్సోరిలో ఇంగ్లీష్ ప్రీమియర్ లీగ్

అనంతపురం : నగరంలోని సంఘమేశ్‌నగర్‌లోని మాంటిస్సోరి పాఠశాలలో ఇంగ్లీష్ ప్రీమియర్ లీగ్ పోటీలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ ఉన్న విద్యార్థులను నాలుగు వర్గాలుగా విభజించి భాషా ప్రాముఖ్యతపై ఇంగ్లీషులో గ్రామర్, పదజాలం, వ్యాకరణం తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంగ్లీషు ప్రాముఖ్యతపై విద్యార్థులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సి.సూర్యనారాయణరెడ్డి, పాఠశాల కార్యదర్శి మాధవి, ప్రిన్సిపల్ పద్మావతి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కవిరత్న సాయినాథ్‌కు ప్రశంసాపత్రం

నార్పల : మండల కేంద్రానికి చెందిన కవి, రచయిత, ఉపాధ్యాయుడు కవిరత్న వల్లెపు వెంకట సాయినాథ్ సహస్ర కవి సమ్మేళన అభిశంసన పత్రాన్ని అందుకున్నారు. గతనెల అంతర్జాల జూమ్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ తొలి జానపద అకాడమీ మాజీ అధ్యక్షులు పొట్లూరి హరికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సహస్ర కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో పాల్గొన్న సాయినాథ్ 'నేను నాదేశం' (అమ్మ, తెలుగమ్మ, భారతమ్మ) అనే మూడు అంశాల్లో ఒక అంశంలో తమ చక్కని కవితలను అందించారు. ఇందుకుగాను అభిశంసన పత్రాలను అందజేశారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే 'సురక్ష' లక్ష్యం

'జగనన్న ఆరోగ్య సురక్ష'లో నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రతి ఇంటా ఆరోగ్య రక్షణ కోసమే ముఖ్యమంత్రి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని తీసుకొచ్చారనిఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. మంగళవారం నగరంలోని ఇందిరానగర్, నారాయణపురాల్లో ఏర్పాటు చేసిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేసి మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. గ్రామీణ స్థాయి నుంచే మెరుగైన వైద్య సదుపాయాలు అందించే దిశగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో ప్రజలకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ రెఫరల్ ఆస్పత్రులకు పంపనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో కమిషనర్ భాగ్యలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్, ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ రిజ్వాన్, జేసీఎస్ కన్వీనర్లు చింతా సోమశేఖరరెడ్డి, ఆలమూరు శ్రీనివాసరెడ్డి, వీరా రామకృష్ణారెడ్డి, కార్పొరేటర్లు దుర్గాదేవి, శ్రీనివాసులు, శేఖర్‌బాబు, మునిశేఖర్, వైసీపీ క్లస్టర్ అధ్యక్షులు రమణారెడ్డి, మధుసూదన్ గౌడ్, ఎంపీటీసీలు హాజివలి, నాగేంద్ర, శశి, వైసీపీ యువజన విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండలంలోని కొట్టాలపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ప్రారంభించారు. ఇందులో భాగంగా గైనకాలజీ వైద్యులు డాక్టర్ నిసార్ బేగం, జనరల్ ఫిజీషియన్ మనోరాజ్, తదితరులు దాదాపు 136 మందికి పరీక్షలు నిర్వహించి 50 మందిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి.సునీత, జడ్పిటిసి నీలం భాస్కర్, సర్పంచి పార్వతి, వైసిపి మండల కన్వీనర్ అంకే నరేష్, ఎంపిటిసి వెంకటలక్ష్మి, మండల ప్రత్యేకాధికారిణి శ్రీదేవి, జిల్లా మలేరియా అధికారి ఓబులు, ఎంపిడిఓ తేజోష్ణ, తహశీల్దార్ రమాదేవి, ఇఒఆర్‌డి దామోదరమ్మ, పంచాయతీ సెక్రటరీ సాదిక్‌వలి, సచివాలయ సెక్రటరీ సువర్ణ, మండల వైద్యాధికారి డాక్టర్ స్వాతిలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : సిఎం జగన్ ప్రభుత్వం ప్రజల ఆరోగ్య రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని ఈస్ట్ నరసాపురం గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందించాలనే సంకల్పంతో ప్రవేశపెట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల పాలిట వరంగా మారిందన్నారు. ప్రజల ఆరోగ్య స్థితిగతులను జల్లెడపట్టి వారి ఇష్టం మేరకే పరీక్షలు నిర్వహించి వైద్యం చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి, ఎపి రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ సిహెచ్.ప్రమీల, ఎంపిపి యోగేశ్వరి, ఎంపిడిఒ నిర్మలాకుమారి, తహశీల్దార్ ఈశ్వరమ్మ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.ఉమాదేవి, ఇఒఆర్‌డి డి.మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి నర్మదా రామాంజనేయులు, వెల్ఫేర్ అసిస్టెంట్ హర్షవర్ధన్, సర్పంచి బొమ్మన గోపాల్‌రెడ్డి, బొమ్మన భాస్కర్‌రెడ్డి, ఎన్‌వి.నారాయణ, వైసిపి మాజీ మండల కన్వీనర్ చెన్నకేశవులు, కోరే రాముడు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామీణ ప్రాంతవాసులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని ఎంపిడిఒ దివాకర్, తహశీల్దార్ హరికుమార్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని బొందలవాడ గ్రామంలో నిర్వహించిన జగన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యం కోసం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఇబ్బందులు పడకుండా రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగంలో అనేక మార్పులు తీసుకొచ్చిందన్నారు. ఇందులో భాగంగానే ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామాలకే వైద్యులు వచ్చి మెరుగైన సేవలు అందిస్తున్నట్లు వివరించారు. కాగా బుధవారం గూగూడు సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ దివాకర్, తహశీల్దార్ హరికుమార్, రవిశంకర్, సూపర్‌వైజర్ శ్రీరాములు, ఎంపిహెచ్‌ఇఒ మల్లికార్జున, ఎఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడమే లక్ష్యంగా సీఎం జగన్ వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. మంగళవారం మండలంలోని చెర్లోపల్లి గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రజలకు గ్రామ సచివాలయ స్థాయిలో వైద్యసేవలు అందించడానికి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, వైద్యాధికారులు, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.


వైద్యలను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనంత


బుక్కరాయసముద్రంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్షలో మాట్లాడుతున్న జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

ఆత్మకూరు : మండల పరిధిలోని తోపుదుర్తి గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తోపుదుర్తి ఆత్మా రామిరెడ్డి మాట్లాడుతూ పేదలందరికీ రూపాయి ఖర్చు లేకుండా మెరుగైన వైద్యం అందించాలన్నదే సిఎం జగన్ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగానే ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి హేమలత, వైస్ ఎంపిపిలు నీలిమ, విజయకుమార్, ఎంపిడిఒ రఘునాథ్, వైద్యాధికారి దయాకర్, మండల కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, జెసిఎస్ ఇన్‌ఛార్జి నరసింహారెడ్డి, సర్పంచి ఓబులేసు, ఎంపిటిసి పోతులయ్య, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, అతికిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : ప్రజల వద్దకే ప్రభుత్వ వైద్యసేవలు అందించడమే ధ్యేయంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి హనుమంతు తెలిపారు. మంగళవారం విడపనకల్ మండల పరిధిలోని డోనేకల్ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఈరమ్మ, ప్రభుత్వ వైద్యాధికారులు శ్రీధర్, సర్పంచి పేట్లో ఎర్రమ్మ, ఎంపిటిసి లక్ష్మీదేవి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రమేష్, వైసీపీ నాయకులు కరణం భీమిరెడ్డి, దేవరాజు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అనంతపురం : రాప్తాడు మండలం గాండ్లపర్తి గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి చిట్రెడ్డి జయలక్ష్మి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి పేదవాడి ఇంటికీ ఆరోగ్యం అందించాలని ముఖ్య ఉద్దేశంతోనే సిఎం జగన్ ఆరోగ్య సురక్షకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సొలమాన్‌రాజ్, మండల కన్వీనర్ జూటూరు శేఖర్, సర్పంచి చిన్ని కృష్ణారెడ్డి, వైద్య అధికారులు, డాక్టర్లు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యుఎస్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఉరవకొండ ఆర్‌డబ్ల్యుఎస్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు కోరారు. ఈమేరకు మంగళవారం స్థానిక కార్యాలయంలో డిఇ అంజుమన్ సుప్రీన్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ 22 సంవత్సరాలుగా కాంటాక్టు పద్ధతిలో పనిచేస్తున్నప్పటికీ తమకు ఉద్యోగ, ఆరోగ్య భద్రత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, బ్యాంకుల ద్వారా జీతాలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలు తక్షణమే మంజూరు చేయాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ నెలనెలా కట్టాలని, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలను ఈనెల 14వ తేదీలోపు పరిష్కరించకుంటే 15వతేదీన విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు ఉద్యోగుల యూనియన్ నాయకులు శ్రీనివాసులు, మల్లికార్జున, లక్ష్మీనారాయణ, ఉమాపతి, తదితరులు పాల్గొన్నారు.


ఆర్‌డబ్ల్యుఎస్ డిఇకి వినతిపత్రం సమర్పిస్తున్న ఉద్యోగులు

భవ్యశ్రీని హత్య చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

చిత్తూరు జిల్లా పెనమలూరు మండలం వేణుగోపాలపురానికి చెందిన విద్యార్థిని వడ్డెర భవ్యశ్రీని అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని పలు పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం పట్టణంలోని వినాయక సర్కిల్‌లో వివిధ పార్టీలు సంఘాల ప్రతినిధులు ధర్నా, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవ్యశ్రీని ముగ్గురు యువకులు అత్యాచారం చేసి అత్యంత కిరాతకంగా హతమార్చి గుర్తు పట్టకుండా ఉండేందుకు గుండు గీసి కనుబొమ్మలు, నాలుకను కోసి చంపడం హేయమైన చర్య అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ, సిపిఎం తాలూకా కార్యదర్శి మల్లికార్జున, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగార్జున, ఎంఆర్‌పిఎస్ హరిగోపాల్, కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ వడ్డే జయన్న, బీఎస్పీ తాలూకా అధ్యక్షులు ఉల్లిగప్ప, వడ్డే సంఘం నాయకులు అధ్యక్షులు శ్రీనివాసులు, యూత్ అధ్యక్షుడు కేశవ్, ఎఐవైఎఫ్ కుమార్‌నాయక్, యూత్ కాంగ్రెస్ అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


మానవహారం నిర్మించి నిరసన తెలుపుతున్న దృశ్యం

క్రీడాపోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో వివిధ క్రీడాంశాల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు రామగిరి ఎపి మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ సర్వేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాఫ్ట్‌బాల్ బాలుర పోటీల్లో జి.మోక్షిత్‌రాయల్, ఎన్.ప్రతాప్, బేస్‌బాల్ బాలుర పోటీల్లో కె.వంశీ, ఎస్.బన్నీ, ఎస్.అజయ్‌నాయక్, బేస్‌బాల్ బాలికల పోటీల్లో టి.వెన్నెల, కె.మంజులాబాయి, జి.లిల్లీ, సాఫ్ట్‌బాల్ బాలికల్లో ఎన్.సంధ్య, కె.మోహన్‌రూప, ఆర్ట్స్ కళాశాలలో జరిగిన అండర్-19 ఖోఖో పోటీల్లో విజయ్, కె.మోహన్‌రూప, త్రోబాల్ పోటీల్లో టి.అంజలి, యోగాలో టి.వెన్నెల, అథ్లెటిక్స్ హైజంప్‌లో బాలికల పోటీల్లో జిల్లాస్థాయిలో టి.వెన్నెల మూడోస్థానం, 200 మీటర్ల పరుగు పందెంలో మూడవ స్థానంలో కె.మోహన్‌రూప, 400మీటర్ల పరుగు పందెంలో టి.వెన్నెల ప్రతిభ కనపరిచినట్లు తెలిపారు. భవిష్యత్తులో చదువుతోపాటు క్రీడల్లో ఉన్నత స్థానంలో రాణించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు.


క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

హాస్టళ్లపై నిర్లక్ష్యం తగదు : ఎస్ఎఫ్ఐ

శింగనమల : ప్రభుత్వ హాస్టళ్లపై అధికారుల నిర్లక్ష్యం తగదని ఎస్ఎఫ్ఐ నాయకులు తరిమెల గిరి, సూర్యప్రకాష్ అన్నారు. మంగళవారం మండలంలోని తరిమల ప్రభుత్వ సంక్షేమ హాస్టల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. అయినా ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. ముఖ్యంగా మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో సరైన వసతులు లేవన్నారు. ప్రహరీ, స్నానపు గదులు లేవన్నారు. ఆఖరికి తాగడానికి నీటి వసతి కూడా లేదన్నారు. దీంతోపాటు తరిమల సంక్షేమ హాస్టల్లో కూడా సమస్యలు తాండవిస్తున్నాయన్నారు. ముఖ్యంగా పైకప్పు పెచ్చులూడి భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు గంగాధర్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన టిడిపి దీక్షలు

బొమ్మనహాల్ : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగళవారం పాదయాత్ర చేపట్టారు. బొమ్మనహాల్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర నేమకల్లు వరకూ సాగింది. నేమకల్లులో ఆంజనేయస్వామికి పూజలు చేసి చంద్రబాబు త్వరగా విడుదల కావాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా చంద్రబాబును అరెస్టు చేయడం జగన్ నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, మాజీ డీలర్లు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ మండలంలో చేపట్టిన రిలేదీక్షలు మంగళవారం కూడా కొనసాగాయి. ఇందులో భాగంగా టిడిపి నాయకులు మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు మాట్లాడుతూ తమ అధినేత చంద్రబాబుపై తప్పుడు కేసులు బనాయించి జైలులో ఉంచడం బాధాకరమన్నారు. ప్రజా సమస్యలు, అభివృద్ధిపై ప్రశ్నిస్తుండటం వల్లే చంద్రబాబును అరెస్టు చేశారన్నారు. చంద్రబాబును విడుదల చేయకపోతే రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

ఉరవకొండ : చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం బాధాకరమని ఏకిలనాయుడు కులసంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో భాగంగా ఏకిల నాయుడు కులం నాయకులు చెవిలో పువ్వులు పెట్టుకుని మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ ఏకిలనాయుడు కుల సంఘం నాయకులు బండారు సుధాకర్‌నాయుడు, గూండాల శివయ్య, చింతల నాయుడు, మరుట్ల ప్రభాకర్, గోవిందరాజులు, ఎర్రిస్వామి, సురేష్, రామకృష్ణ, నల్లప్ప, సుధాకర్‌నాయుడు, ఏకిల కులసంఘం నాయకులు పాల్గొన్నారు.

హంద్రీనీవా నీటిని పూర్తిస్థాయిలో వాడుకుంటాం..

బెలుగుప్ప : హంద్రీనీవా నీటిని ఒక ప్రణాళిక ప్రకారం రైతుల ఆకాంక్షలకు అనుగుణంగా చెరువులను నింపి పూర్తి స్థాయిలో సద్వినియోగం చేస్తామని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని అంకంపల్లి పంప్‌హౌస్ నుంచి శీర్పి, బెలుగుప్ప చెరువులకు నీరు విడుదల చేశారు. ముందుగా శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం కెనాల్ వద్ద గంగపూజ చేసి హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు బాగుండాలని సీఎం జగన్ అనుక్షణం కష్టపడుతున్నారన్నారు. ఈసారి వర్షాలు తక్కువైనప్పటికీ జిల్లాలో హంద్రీనీవా ద్వారా ఇప్పటికే అనేక చెరువులు నింపామన్నారు. మిగతా అన్ని చెరువులను కృష్ణాజలాలతో నింపుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దన్న, మండల కన్వీనర్ మచ్చన్న, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ దుద్దేకుంట రామాంజనేయులు, సహకార సంఘం అధ్యక్షుడు శివలింగప్ప, సర్పంచి రుద్రానంద, ఎపిటిసి శ్రీనివాస్‌రెడ్డి, జెసిఎస్ కన్వీనర్ శ్రీనివాసులు, ఇఇ రామకృష్ణయాదవ్, డిఇ శ్రీనివాస్‌నాయక్, ఏఎం ఆజాం, హంద్రీనీవా సిబ్బంది, వైసిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నీటిని విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


మృతిచెందిన ప్రకాష్

రాయదుర్గం : పట్టణంలోని పార్వతీనగర్ వద్ద మంగళవారం సాయంత్రం ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడటంతో వాల్మీకి నగర్ చెందిన ప్రకాష్ (25) మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం కేసులో పట్టుబడిన కారు ప్రభుత్వానికి జప్తు

అనంతపురం క్రైం : మద్యం రవాణాలో పట్టుబడిన కారును ప్రభుత్వానికి జప్తు చేస్తున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) ఇన్స్‌పెక్టర్ ఆర్.రవిచంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెబ్ అనంతపురం పరిధిలో 13-08-2021 తేదీన ఇద్దరు హోండా సిటీ కారులో మద్యాన్ని అక్రమ రవాణా చేస్తూ పట్టుబడ్డారన్నారు. ఈ వాహనాన్ని ప్రభుత్వానికి జప్తు చేయటానికి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌లో ఉన్న చిరునామాలో వాహన యజమాని కోసం ప్రయత్నించగా ప్రస్తుతం అక్కడ నివసించటం లేరన్నారు. దీంతో వాహనం గురించి ఎవరూ అభ్యంతరం వ్యక్తం చేయకపోతే ప్రభుత్వానికి జప్తు చేసినట్లు తెలిపారు.

కర్నాటక మద్యం స్వాధీనం

అనంతపురం క్రైం : ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు సెబ్ పోలీసులు కర్ణాటక మద్యంపై ఉక్కుపాదం మోపారు. బ్రహ్మసముద్రం మండలం గుడిపల్లి గ్రామ సమీపంలోని ఓ తోటలో కర్నాటక మద్యం దాచినట్లు సెబ్ అదనపు ఎస్పీ జి.రామకృష్ణకు సమాచారం అందింది. దీంతో ఆయన ఆదేశాల మేరకు సెబ్ ఇంటెలిజెన్స్ సీఐ నరసానాయుడు, సెబ్ ప్రత్యేక బృందం సీఐ నాగేంద్ర ప్రసాద్, కళ్యాణదుర్గం సెబ్ సిబ్బంది దాడులు నిర్వహించి గుడిపల్లికి చెందిన పాలయ్య, దేవేంద్రను అదుపులోకి తీసుకుని 29 బాక్సుల (2,784 పాకెట్లు) కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కర్నాటక సరిహద్దులోని కొండ్లపల్లి మద్యం దుకాణం నుంచి అక్రమంగా తరలించినట్లు విచారణలో తేలింది.

సామాజిక కార్యక్రమాలు చేపట్టాలి : జెసి

గుత్తి : మెటల్ స్టోన్ క్రషర్స్ యాజమాన్యం గ్రామాల్లో సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సూచించారు. మంగళవారం మండలంలోని కరిడికొండ గ్రామ సమీపంలో రోడ్ మెటల్, బిల్డింగ్ స్టోన్, ఎం.శాండ్ యూనిట్ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ యూనిట్ ఏర్పాటు చేయు గ్రామాల్లో ఇంకుడు గుంతలు, చెక్‌డ్యామ్‌లను నిర్మించాలన్నారు. మొక్కలను నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఉచితంగా వైద్య శిబిరాలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీసీబీ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పివి.కిషోర్, ఎఇఇ కృష్ణారెడ్డి, తహశీల్దార్ మహబూబ్‌బాషా, ఆర్ఐ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే స్వచ్ఛమైన వాతావరణం

కళ్యాణదుర్గం : తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితేనే స్వచ్ఛమైన వాతావరణం ఉంటుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జగన్నాథం సూచించారు. స్వచ్ఛహీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం కళాశాల పరిసరాల్లో చెత్తా, చెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ కలలు సాకారం కావాలంటే దేశంలోని ప్రతివీధి, గ్రామ, పట్టణ ప్రాంతం శుభ్రంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశ్, జయలక్ష్మి, బాపూజీ, ఓబులేశ్, తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాలనూ ఆదుకోవడమే సిఎం జగన్ ఆశయం

పుట్లూరు : రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేదల శ్రేయస్సే సిఎం జగన్ ఆశయమని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. మంగళవారం మండలంలోని చెర్లోపల్లి, ఓబులాపురం, దోసలేడు గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుత జగనన్న పాలనలో పేదల ఇంట సంక్షేమ పథకాల పంట పండుతోందన్నారు. సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థతో అవినీతి రహిత పాలనను అందిస్తున్న ఏకైక సిఎం జగనన్న మాత్రమే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ యోగానందరెడ్డి, తహశీల్దార్ మోహన్‌కుమార్, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలను కొనసాగిస్తాం

అనంతపురం : మహనీయుల ఆశయాలను కొనసాగిస్తామని, ఇందులో భాగంగానే సిఎం జగన్ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని రుద్రంపేట సర్పంచి సుగాలి పద్మావతి ఆదినారాయణనాయక్ తెలిపారు. మహాత్మా గాంధీ జయంతి వేడుకల్లో భాగంగా మంగళవారం అనంత రూరల్ మండలం రుద్రంపేట గ్రామసచివాలయం-4లో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలను కొనసాగించడం సిఎం జగన్‌తోనే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్‌జి ఎస్.బాలన్న, వార్డు సభ్యులు శిరోమణి, అంజి, పద్మావతి, సుధాకర్, సచివాలయ కన్వీనర్లు అక్కులప్ప, రామ్మూర్తి, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వాలంటర్లీ, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ప్లాంట్ ప్రారంభం

అనంతపురం : అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి సర్పంచి అంజీయాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత తాగునీటి ప్లాంట్‌ను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధిలో రాచానపల్లి పంచాయతీ దూసుకెళ్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు, ఎంపిపిలు, జడ్పిటిసిలు, వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, ఛైర్మన్లు, డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎస్పీని కలిసిన టిటిడి బోర్డు సభ్యులు

అనంతపురం క్రైం : ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌ను తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యులు అశ్వర్థనాయక్ మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. టీటీడీ బోర్డు సభ్యులుగా ఎన్నికైన అశ్వర్థనాయక్‌కి ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు.

ఈక్రాప్ నమోదు తనిఖీ

ఉరవకొండ : 2023 ఖరీఫ్ సీజన్‌లో గ్రామస్థాయి వ్యవసాయ అధికారులు చేసిన ఈక్రాప్ నమోదును మండల వ్యవసాయ అధికారి శుభకర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు తప్పకుండా ఇకెవైసి చేయించుకోవాలన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని మోపిడి, ఆమిద్యాల, రాకెట్ల, రైతు భరోసా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా సిబ్బంది పరిమళ, మీనాక్షి, రామ్మూర్తి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఇకెవైసి చేయించుకోండి..


ఇకెవైసిపిపై సిబ్బందితో చర్చిస్తున్న ఎడిఎ రవి

గార్లదిన్నె : ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు రేపటిలోగా ఇకెవైసిపి చేయించుకోవాలని అనంతపురం వ్యవసాయ సహాయ సంచాలకులు రవి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో ఇకెవైసి చేయించుకున్న రైతుల వివరాలను స్థానిక మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్‌ని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకూ ఉద్యాన పంటలకు సంబంధించి వందశాతం ఈక్రాప్ బుకింగ్ పూర్తయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.